# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం 23 మే 2025 www.prajaswaramdaily.com 4 pm


# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

## నలుగురు మావోయిస్టులు మృతి

హైదరాబాద్ : మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ జరిగింది. భమ్రాగఢ్‌లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని కిష్టారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు పలువురు కీలక నేతలు సైతం ఉన్నారు. నంబాల కేశవరావుపై రూ. కోటిన్నర రివార్డు ఉన్న సంగతి తెలిసిందే.



# బసవేశ్వరుడి స్ఫూర్తితో ప్రభుత్వ పాలన





జనగణనతో పాటు కులగణన

సామాజిక న్యాయం, సమానత్వంపై దృష్టి

సీఎం రేవంత్

జహీరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వరుల స్ఫూర్తితో పాలన సాగిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.అంతేకాకుండా.. వారి సిద్ధాంతాలను అనుసరిస్తూ సామాజిక న్యాయమని, సమానత్వంపై దృష్టి సారిస్తున్నామని అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. బసవేశ్వరుడి చూపిన మార్గం తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రాహుల్ గాంధీ చేసిన 150 రోజుల పాదయాత్రను గుర్తు చేస్తూ.. ఆ యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఇది బసవేశ్వరుడి సిద్ధాంతాలనే ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. బసవేశ్వరుడి సందేశం అనుసరించి, ప్రతి వర్గానికి సముచిత భాగస్వామ్యం కల్పించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ రాజ్యానికి బసవేశ్వరుని సందేశం మానవతా విలువలపై ఆధారపడి ఉన్న సూచికగా అభివర్ణించారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖలు, ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు.

### 490 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ చేశారు. తొలుత హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ లో జహీరాబాద్ కు చేరుకున్న సీఎం హుగ్గెల్లి చౌరస్తాలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాచునూరు శివారులో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ప్రారంభించారు. జహీరాబాద్ లో 100 కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని అక్కడి నుంచి జాతికి అంకితం చేశారు. నిమ్జ్ కోసం 100 కోట్లతో నిర్మించిన 4 వరుసల రహదారిని కూడా ప్రారంభించారు. జహీరాబాద్ తాగునీటి అవసరాల కోసం అమృత్ పథకంలో భాగంగా.. 60 కోట్లతో చేపడుతున్న పథకానికి శంకుస్థాపన చేశారు. మొత్తంగా 490 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మహిళ సంఘాల ఉత్పత్తుల్ని పరిశీలించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటల ఉత్పత్తిని తిలకించారు. అనంతరం మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పెట్రోల్ బంక్ ను పరిశీలించారు.

# ఓటీటీ ఫ్యామిలీ డ్రామా

దాని టైటిల్ "కాంగ్రెస్ వదిలిన బాణం"

తెలంగాణలో కాంగ్రెస్.. బీఆర్ఎస్ రెండు పార్టీలు విఫలం

ఈ రెండు కలిసి బీజేపీని బద్నాం చేసే కుట్ర

కుటుంబ పాలనకు మా పార్టీ వ్యతిరేకం

అది గాంధీల, కల్వకుంట్ల కుటుంబాలు అయినా


కవిత లేఖపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్



హైదరాబాద్: "లెటర్ టూ డాడి" అని కవిత రాసిన లేఖ ఒక ఓటీటీ ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. దాని టైటిల్ కాంగ్రెస్ వదిలిన బాణమని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్.. బీఆర్ఎస్ రెండు పార్టీలు విఫలం అయ్యాయన్నారు. అందుకే అవి రెండు కలిసి బిజెపిని బద్నాం చేసే కుట్రలకు తెరలేపాయని.. కుటుంబ పాలనకు బీజేపీ వ్యతిరేకం..అది గాంధీల కుటుంబం అయిన కల్వకుంట్ల కుటుంబం అయిన అని స్పష్టం చేశారు. వారి కుటుంబ సంక్షోభాలను గొడవలను ప్రజల భావోద్వేగాలుగా మలుస్తాయని పేర్కొన్నారు.. బీజేపీ ఎవరిని జైలుకు పంపదని స్పష్టం చేశారు. చట్టం ముందు దోషులని తేలితే వారు జైలుకు వెళుతారన్నారు.. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతుందని, ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీపై కేసీఆర్ పరిమితంగా మాట్లాడటంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభ అనంతరం అధినేత కేసీఆర్‌కు కవిత రాసినట్టుగా ఓ లేఖ బయటికొచ్చింది. గతంలో కవిత రాసిన లేఖల్లో ఉన్న దస్తూరితో.. ఈ లేఖలోని దస్తూరీ సరిపోలుతోంది. సభ విజయవంతమైనందుకు కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ లేఖ రాసిన కవిత.. పాజిటివ్, నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట 8 అంశాలను ప్రస్తావించారు. ఈ లేఖపై తాజాగా బండి సంజయ్ స్పందిస్తూ.. ఓ ట్వీట్ చేశారు.

# రేప్ కేసులో బెయిల్ పై వచ్చి విజయోత్సవ ర్యాలీ





వారి తీరు వివాదాస్పదం

హావేరి జిల్లాలో ఘటన

బెంగళూరు : గ్యాంగ్ రేప్ కేసులో బెయిల్ పొందిన నిందితులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం ప్రస్తుతం వివాదాస్పదమైంది. ఈ ఘటన కర్ణాటక హావేరి జిల్లాలో చోటు చేసుకుంది. 16 నెలల క్రితం జిల్లాలోని ఓ హోటల్ గదిలో ఉన్న ఓ జంటపై కొందరు దాడి చేశారు. మహిళను సమీపంలోని అడవిలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి అఫ్తాబ్ చందనకట్టి, మదార్ సాబ్ మండక్కి, సమీవుల్లా లాలనవర్, మహమ్మద్ సాదిక్ అగసిమని, షోయబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సవికేరి అనే ఏడుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. నిందితులకు హావేరి సెషన్స్ కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు హావేరిలోని అక్కి ఆలూర్ పట్టణంలో 'కమ్ బ్యాక్' ర్యాలీ నిర్వహించారు. బైకులు, కార్లతో భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కారు సన్‌రూఫ్ నుంచి నిందితులు బయటకు వచ్చి కేకలు వేస్తూ, విజయ సంకేతాలు తీస్తూ ర్యాలీ తీశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# మెట్రో కొత్త ఛార్జీలు

కనీస ఛార్జీ రూ. 11

గరిష్ఠ ఛార్జీ రూ. 69

ఎల్ అండ్ టీ నిర్ణయం



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మెట్రో రైళ్ల ఛార్జీలను సవరించారు. మెట్రో రైలు కనీస ఛార్జీ రూ. 11, గరిష్ఠ ఛార్జీ రూ. 69కి సవరించారు. సవరించిన మెట్రో ఛార్జీలు ఈ నెల 24వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. మెట్రో ఛార్జీలు తగ్గించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పెంచిన ధరల్లో 10 శాతం రాయితీ కల్పిస్తూ ఎల్ అండ్ టీ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.

### సవరించిన హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలు

మొదటి 2 కి.మీ. వరకు రూ. 11

2 నుంచి 4 కి.మీ. వరకు రూ. 17

4 నుంచి 6 కి.మీ. వరకు రూ. 28

6 నుంచి 9 కి.మీ. వరకు రూ. 37

9 నుంచి 12 కి.మీ. వరకు రూ. 47

12 నుంచి 15 కి.మీ. వరకు రూ. 51

15 నుంచి 18 కి.మీ. వరకు రూ. 56

18 నుంచి 21 కి.మీ. వరకు రూ. 61

21 నుంచి 24 కి.మీ. వరకు రూ. 65

24 కి.మీ. నుంచి ఆపై దూరానికి రూ. 69

# పాక్‌కు గూఢచర్యం ..

## మరో ఇద్దరు అనుమానితుల అరెస్ట్..!





న్యూఢిల్లీ : పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నారన్న అనుమానంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందం ఇద్దరిని అదుపులోకి తీసుకొంది. ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేసే మొహద్ హరూన్‌ను నోయిడాలో అదుపులోకి తీసుకొన్నారు. అతడికి పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలోని ముజమ్మల్ హుస్సేన్‌తో సంబంధాలున్నట్లు గుర్తించారు. ఇతడు వీసా కోసం డబ్బులు, ఇతర సున్నిత సమాచారం చేరవేయడంతోపాటు.. తీవ్రవాద భావజాల వ్యాప్తికి పాల్పడుతున్నట్లు అనుమానం.

హరూన్‌కు పాక్ దౌత్య సిబ్బంది అయిన ముజమ్మిల్‌తో బలమైన సంబంధాలున్నాయని అధికారులు చెబుతున్నారు. వారు నిత్యం కాంటాక్ట్‌లో ఉన్నట్లు గుర్తించారు. హరూన్‌కు పాకిస్థాన్‌లో బంధుత్వాలు ఉండటంతో.. ముజమ్మిల్ వీసాలను ఇప్పించినట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక హరూన్ పాక్ వీసాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గుర్తించారు. ఆ సొమ్ములో కొంత కమిషన్ తీసుకొని.. ముజమ్మిల్ చెప్పిన వ్యక్తులకు మిగిలిన మొత్తం ఇచ్చేవాడు. అతడు పాక్ దౌత్య కార్యాలయంలో పనిచేస్తున్నట్లు తెలిసినా.. హరూన్ సహకరించాడని ఏటీఎస్ బృందం చెబుతోంది. దీంతో సున్నితమైన సమాచారం చేరవేసి ఉండొచ్చని సమాచారం. ఇటీవలే ప్రభుత్వం ముజమ్మిల్ హుస్సేన్‌ను అనుమానిత వ్యక్తిగా ప్రకటించిన భారత్.. అతడిని స్వదేశానికి తిరిగి పంపింది.

ఇక ఆదంపుర్, వారణాసీల్లో నిర్వహించిన ఆపరేషన్‌లో ఏటీఎస్ బృందం తుఫేల్ అనే మరో వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు దేశ వ్యతిరేక వాట్సాప్ గ్రూప్‌లో చేరినట్లు గుర్తించారు. దీనిని పాకిస్థాన్‌లోని సంస్థలు నిర్వహిస్తున్నాయి. దీంతోపాటు అతడు సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్‌కు అందించినట్లు గుర్తించారు.

"తుఫేల్ పాకిస్థాన్‌లోని వ్యక్తులు, సంస్థలతో సంబంధాలు నెరుపుతున్నారు. పాక్‌లో నిషేధానికి గురైన తెహ్రీక్ ఎ లబ్బైక్ సంస్థ వ్యవస్థాపకుడు మౌలానా షాద్ రిజ్వీ వీడియోలను తరచూ షేర్ చేస్తున్నట్లు గుర్తించారు. గజ్వా ఎ హింద్‌కు సంబంధించిన కంటెంట్‌ను అతడు ప్రమోట్ చేస్తున్నాడు. భారత్‌లో షరియా చట్టం తీసుకురావడం వంటి అంశాలను ప్రచారం చేస్తున్నాడు. వారణాసిలోని రాజ్‌ఘాట్, నమోఘాట్, జ్ఞానవాపీ మసీదు, వారణాసీ రైల్వే స్టేషన్, జామా మసీద్, ఎర్రకోట, నిజాముద్దీన్ ఫొటోలను పాక్ వ్యక్తులకు షేర్ చేశాడు" అని ఏటీఎస్ వెల్లడించింది.

# ప్రధాని మోదీ నాయకత్వంపై అంబానీ ప్రశంసలు

భద్రతా దళాల ధైర్యసాహసాలను కొనియాడిన రిలయన్స్ అధినేత

'ఆపరేషన్ సిందూర్' విజయం గొప్ప నిదర్శనమన్న అంబానీ

ఢిల్లీలో 'రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు'లో వ్యాఖ్యలు

ఇదే సదస్సుకు హాజరైన మోదీ

ఈశాన్య భారతాన్ని ఒక 'పవర్‌హౌస్'గా, దేశానికి 'అష్టలక్ష్మి' గా అభివర్ణన

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ దక్షతను, భారత భద్రతా దళాల అసమాన ధైర్యసాహసాలను కొనియాడారు. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' విజయం ఈ రెండింటికీ నిలువెత్తు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు'లో మాట్లాడుతూ అంబానీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ కూడా హాజరయ్యారు.

ఢిల్లీలో రెండు రోజుల పాటు 'రైజింగ్ నార్త్‌ఈస్ట్ ఇన్వెస్టర్స్ సదస్సు' జరుగుతోంది. ఈశాన్య రాష్ట్రాలలో పెట్టుబడులను ఆకర్షించి, ఆ ప్రాంత అభివృద్ధికి ఊతమివ్వడమే ఈ సదస్సు యొక్క ప్రధాన లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మన దేశంలో, ఈశాన్య ప్రాంతం మరింత ప్రత్యేకమైన వైవిధ్యతను కలిగి ఉందని అన్నారు. ఈశాన్య భారతాన్ని ఒక 'పవర్‌హౌస్'గా, దేశానికి 'అష్టలక్ష్మి' వంటిదని ఆయన అభివర్ణించారు.

ఇదే సదస్సులో పాల్గొన్న ముకేశ్ అంబానీ, ప్రధాని మోదీ నాయకత్వ పటిమకు సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. అలాగే, దేశ భద్రత కోసం అహర్నిశలు పాటుపడుతున్న భద్రతా బలగాల సాహసోపేత చర్యలను ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్'పై ముకేశ్ అంబానీ గతంలోనూ స్పందించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యంగా, స్థిరంగా, దృఢ సంకల్పంతో పోరాడుతోందని ఆయన అన్నారు. మన సాయుధ దళాల శౌర్యపరాక్రమాలను చూసి గర్వపడుతున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

